# కోర్టు

అది మేడ-

ఆ మేడమీదనుంచి చూస్తే మనుషులు గలివర్స్ ట్రావెల్స్ కథలో లిల్లీపుట్స్‌లాగ కనిపించరు. రోడ్డుమీద నిలబడి, ఆ రోడ్డుపైన మనుషుల్ని చూస్తే ఎలా కనిపిస్తారో ఇంచుమించు అలానే కనిపిస్తారు, ఆ మేడమీదనుంచి చూస్తే కూడ.

అది ఎత్తైన మేడ కాదు, ఆ మేడే కాదు, ఆ మేడలో అద్దెకుంటున్న మనిషి కూడ పెద్ద ఎత్తైన వాడేమీ కాదు. మనుషుల్లో కొందరిని దేవతల్లాగ, మరికొందరిని రాక్షసుల్లాగ చూడటం అలవాటులేని వాడు. అందరినీ ఒకేలాగ చూడవలసిన వాడు, చూడ తగినవాడు, చూసేవాడు—అతను వేదాంతరావు.

వేదాంతరావుకెటూ తోచటంలేదు. అతనిలో ఏదో అశాంతి, ఆవేదన, బాధ, దుఃఖం.

పైన పోతున్న విమానం తాలూకు ప్రొపెల్లర్ లాగ తిరుగుతున్నాయి ఆలోచన్లు. ప్రొపెల్లర్ గాలిని కోస్తే ఆలోచనలు మనసునే కోసేట్లున్నాయి. ఏంచేస్తే తను న్యాయానికి న్యాయం చేసిన వాడవుతాడు? ప్రపంచంలో న్యాయాన్ని ధర్మాన్ని చంపేటానికేనా ఈ కోర్టులు? ఎటువంటి పరిస్థితులెదురైనాసరే న్యాయాన్నే అమలు పరుస్తున్నానని తను తీసుకున్న నిర్ణయం గాలిలో కలిసిపోవల్సిందేనా?"

"చూడు ఇలాటివి లోకంలో చాలా జరుగుతున్నాయి. ఎన్నింటినని నువ్వరికట్టగలవు? నీ భవిష్యత్తును ఇంతగా తీర్చి దిద్దిన రంగధామరావు

మాటలు మరచిపోయావా? నీ భార్య, స్నేహితులు వీరందరికన్నా నీ అభివృద్ధిని కోరేదెవరు?" మరో మనసు అన్యాయంవైపు మొగ్గుతోంది.

"లోకంలో అన్యాయం జరుగుతోందని నువ్వూ అన్యాయమే చేస్తావా? మండే ఆ అన్యాయపు మంటలో ఆజ్యం పోస్తావా? అన్యాయం చేయమని రంగధామరావు చెబితే మాత్రం? ఆయన చేసిన సహాయాన్ని నీవృత్తిధర్మంతో ముడిపెట్టినవాడు ఆయనా పెద్దమనిషి?" న్యాయం వైపు పరిగిడుతోంది మనస్సు.

"రూపంలేని మనస్సు రూపమున్న మనిషిమీద ఎంత పెత్తనం చేస్తుంది? అసలు మనందరికీ ఉన్నది ఒక మనస్సేనా? లేక రెండు మూడు మనస్సులా?" తన ఆలోచనకు నవ్వొచ్చింది వేదాంతరావుకి.

పెట్టిలోంచి సిగరెట్టు తీస్తూ అనుకున్నాడు వేదాంతరావు. 'మనసులోంచి సరైన నిర్ణయాన్ని తీయటం, పెట్టిలోంచి సిగరెట్టు తీసినంత సులభమైతే?'

అగ్గిపుల్ల గీసి వెలిగించుకున్నాడు వేదాంతరావు. ఆలోచనల్ని కాదు, సిగరెట్టును.

సిగరెట్టు కాలిపోతోంది. మనస్సు ఆలోచిస్తోనేవుంది.

వేదాంతరావు సమీపంలో సముద్రం లేదు. కానీ అతని మనసులో సముద్ర గర్జనలున్నాయి. అతనికి దగ్గరలో రైల్వే స్టేషన్ లేదు. కానీ అతని మనసులో రైళ్ళ రణగొణ ధ్వని వుంది.

* * *

వేదాంతరావు తీవ్రమైన మనోవేదనకు గురైననాటికి సరిగ్గా పదిరోజుల క్రితం రంగధామరావుగారు వేదాంతరావింటికి వచ్చారు. వేదాంతరావింటికి ఆయన రావటం అదే మొదటిసారి.

రంగధామరావుగారు ఢిల్లీలో చాలా పెద్ద ఉద్యోగి. ఆయన చూపిన సానుభూతి వల్లనే వేదాంతరావీనాడు ఇంత వాడయ్యాడు.

రంగధామరావుపట్ల కృతజ్ఞత వేదాంతరావులో అణువణువునా వుంది. తిండి లేనప్పుడు ఆయన పిలిచి తిండి పెట్టాడు వేదాంతరావుకి. ఆ తిండి రక్తంగా మారి వేదాంతరావులో ప్రవహిస్తోంది.

మనసంటే ఏమిటో తెలీని వేదాంతరావుకి మనసిచ్చి పెంచాడు రంగధామరావు. అందుచేత వేదాంతరావు మనసుకి రంగధామరావుని కాదనే శక్తి లేదు.

అటువంటి రంగధామరావు కబురు చేయకుండా తనంతట తానే వేదాంతరావింటికొచ్చాడు. వచ్చినవాడు ఎంత బతిమాలినా వినకుండా రెండేరెండు రోజులున్నాడు ఆ రెండురోజుల్లో కూడా ఒక్కే ఒక్క సంగతి చెప్పాడు. చెప్పినవాడు వేదాంతరావు సమాధానం ఆశించలేదు. అతనేం చెప్తాడో అని కూడా అనుకోలేదు. అసలు రంగధామరావుకి తన అభిప్రాయాలు, నిర్ణయాలు చెప్పటమే కాని ఎదుటివార్ని వాటిని అమలు పరుస్తావా లేదా అని అడగటం ఎప్పుడూ అలవాటు లేదు. ఎందుకంటే ఆయన మాటకెవరూ ఎదురు చెప్పలేరు. వేదాంతరావు అసలే చెప్పడనీ ఆయన నమ్మకం. అందుకే సంగతి చెప్పి వెళ్ళిపోయాడు.

ఎడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్ వేదాంతరావు తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చాడన్న సంగతి ఊరంతటా తెలిసిపోయింది.

"ఎంతపని చేశారండీ ఇప్పుడు మీరసలేం చేద్దామని? ఇన్నాళ్లూ సంపాదించింది పొదుపు చేసిందేమీ లేదు. ఈ దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకో లేకపోయారు. వెలిగే దీపాన్ని తన్నేశారు. ఆర్పే దాకా మీకు నిద్రపట్టలేదు కూడా' భార్య సాధింపులు.

"ఏదేమిటి వేదాంతరావ్ ఎందుకలా చేశారు?"

"మీరు రిజైన్ చేశారంటే నేను నమ్మలేక పోతున్నాను"

"రిజైన్ చేసేటంత పరిస్థితేమొచ్చింది?"

ఈక్వల్ కేడర్‌లో వున్న మిత్రుల పలకరింపులు.

అన్నీ విన్నాడు. విని వూరుకున్నాడు వేదాంతరావు. సాయంత్రం రాధాకృష్ణమూర్తి వచ్చాడు. మూర్తి, వేదాంతరావు చిన్నప్పటినుంచీ స్నేహితులు. ఇప్పుడు మూర్తి అసిస్టెంటు ఇంజనీరుగా పని చేస్తున్నాడు అదే వూళ్ళో.

ఇద్దరూ చాలాసేపు మాట్లాడుకోలేదు. ఏమైనా అడుగుతాడేమోనని చూశాడు వేదాంతరావు. అడగక పోవడంతో "అలా మేడమీదకు పోదాం పద" అన్నాడు. ఇద్దరూ మేడెక్కారు. సిగరెట్టు ఒకటి మూర్తికిచ్చి తనొకటి వెలిగించుకున్నాడు వేదాంతరావు.

"చూడు మూర్తీ. ఆ సెంటరులో కిళ్ళీబడ్డీ పక్కనున్న ఇల్లు నీకు కన్పిస్తోంది కదూ, ఆ ఇంటి దగ్గర నుంచున్నదెవరో స్పష్టంగా కనిపిస్తోందా?" ఉపోద్ఘాతంగా అడిగాడు వేదాంతరావు.

"అతను డాక్టరు సత్యానందం"

"అంటే అంతకుముందు ఏ మాత్రం పరిశీలనగా చూచిన మనిషినైనా ఇక్కణ్ణించి గుర్తుపట్టడం తేలికే. అవునా?"

ఏదో విషయం ఉందని గ్రహించాడు మూర్తి. అందుకే ఆలోచిస్తూ అన్నాడు. "అవును".

"అప్పటికి ప్రమోషన్‌మీద నేనీవూరికొచ్చి మూడు నెలలు మాత్రమే అయింది. కోర్టునుంచి వచ్చి అలవాటుగా మేడమీద నుంచున్నాను. ఇంకా చీకటి పడలేదు. అక్కడ విక్రమ్ మరొకడిని కాలరు పట్టుకుని గట్టిగా ఏదో అడుగుతున్నాడు. ఇక్కడికి మాటలు వినపళ్ళేదు. కాని విక్రమ్ అవతారం చూసి నేనాశ్చర్య పోయాను. అతను అంత మురికి బట్టలు కట్టుకోగా నేనెప్పుడూ చూడలేదు. కానీ అతను విక్రమే.

అతని మొహం, అతను కాలరు పట్టుకుని అడుగుతున్న మరొకడి వెనక భాగం నాకేసి వున్నాయి''

'విక్రమ్ అంటే ఛైర్మన్ సార్వభౌమరావుగారి అబ్బాయి కదూ?" సందేహ నివృత్తి కోసం అడిగాడు మూర్తి.

"అవును. ఏదో మామూలు కొట్లాట అనుకున్న నేను, విక్రమ్ కత్తి తీసి పొడవడం, ఆ వెంటనే పక్కనున్న టాక్సీలో పారిపోవటం కళ్ళారా చూశాను. మా ప్యూన్ని పంపాను వెంటనే. అప్పటికే జనం, పోలీసులు పోగయ్యారు. పొడవబడిన మనిషి చచ్చిపోయాడు. అతని పేరు వెంకట్రావుట.

ఆ మర్నాడు క్లబ్బు కెళ్ళాను. కేవలం ఛెయిర్మన్‌గారిని కలవటం కోసం. ఆయన రాలేదు. ఆ మర్నాడు మళ్ళీ వెళ్ళాను, ఆయన వచ్చారు. నాతో చాలా ముభావంగా మాట్లాడారు. విక్రమ్ గురించి అడిగాను. అదోలా మొహంపెట్టి అన్నారాయన.

"మీకు తెలీదా, విక్రమ్ వైజాగ్‌లో వుంటున్నాడు" అలాగే "ఎప్పుడు వెళ్ళాడు?" అడిగాన్నేను.

"కోర్టువాళ్ళు ఏవడిగినా క్రాస్ ఎగ్జామినేషన్‌లాగే ఉంటుంది" అని నవ్వేస్తూ -

"బిజినెస్ కోసమని పంపాను. ఇరవై రోజులైంది" అంటూ వెళ్ళిపోయారాయన.

ఆశ్చర్యపోయాన్నేను. ఇప్పుడు అదే కేసు మాకోర్టుకొచ్చింది."

"ఏమిటి, వెంకట్రావు హత్యకేసా?" సిగరెట్ పారేస్తూ అడిగాడు మూర్తి.

"అవును కేసు వివరాలివి :-"

చనిపోయినవాడు : వెంకట్రావు.

చంపినవాడు : రాఘవరావు.

సాక్ష్యాలు :- 1) పోలీసుస్టేషను సమీపంలో దొరికిన రాఘవరావు బట్టలు, వాటిపై వెంకట్రావు బ్లాబ్లాకు రక్తం మరకలు.

2) రాఘవరావు హత్యచేసి పారిపోయిన టాక్సీడ్రైవరు

"విక్రమ్ కదా వెంకట్రావుని చంపింది?" ఆశ్చర్యంగా అడిగాడు మూర్తి.

"అది మనకు తెల్సిన నిజం. కానీ కోర్టు ఆధారాలనే కానీ నిజాన్ని నమ్మదు."

"అదిసరే - రాఘవరావెవరు? అతనేం చెప్తున్నాడు మరి?"

"రాఘవరావు ఓ ఎలిమెంటరీ స్కూలు మాష్టారబ్బాయి. అతనూ, వెంకట్రావు, విక్రమ్ వీళ్ళంతా క్లాస్‌మేట్స్. వాళ్ళతోబాటు వెంకట్రావు చెల్లెలు సరళ కూడ చదువుకుంటోంది. రాఘవరావంటే సరళకు చాలా ఇష్టంట. అయితే ఒకసారి సరళ ఒంటరిగా వున్నప్పుడు విక్రమ్ ఏదో అన్నాడనీ, వెంకట్రావు గట్టిగా బుద్ధిచెప్పాడట. వాళ్ళిద్దరి మధ్యా వైరం పెరిగిందట. దాంతో ఎలాగైనా వెంకట్రావుని చంపి, ఆ నేరం రాఘవరావుపై మోపి జైలుకి పంపాలని విక్రమ్ ప్లాను. ఏదో నాటకంలో నటించాలనీ, రాఘవరావు ఇంట్లో లేనపుడు అతని బట్టలు తీసికెళ్ళాడుట విక్రమ్. ఇదీ రాఘవరావూ, అతని తరఫు లాయరూ చెప్పేది. ఇదీ నిజమే కావచ్చు కానీ నమ్మటానికి ఆధారాలు?"

"మరి హత్య జరిగినచోట కళ్ళబడ్డ వాడు, మిగతా వాళ్ళు ఏమంటారు?"

"వాళ్ళే కాదు మూర్తీ. వెంకట్రావు తల్లిదండ్రులు, ఆఖరికి సరళా కూడ రాఘవరావే వాళ్ళ వెంకట్రావుని చంపిందంటున్నారు."

"సరళ కూడానా!"

"అవును. ఆమె తెలివైంది. రాఘవరావు ఎట్లా జైలుకి పోతాడని తెల్సు. తన జీవితం ఇంకా అఘాయిత్యం కావటం ఆమె ఇష్టంలేక పోవచ్చు. ఆ పైన తల్లిదండ్రుల బలవంతం వుండనే వుంటుంది."

"అయితే డబ్బిచ్చి..."

"పోయిన వెంకట్రావు మరి తిరిగిరాడు. విక్రమ్‌ని జైలుకిపంపటం కాదు ఆ తల్లిదండ్రుల క్కావాల్సింది. డబ్బుంటే వాళ్ళు ఒడిదుడుకులు లేకుండా బతకొచ్చు. సరళ పెళ్ళికూడా చెయ్యొచ్చు" అన్నాడు వేదాంతరావు.

"ఎంత దారుణం?

"అవును. ధారుణమే? ఈ రోజుల్లో న్యాయంకోసం ఏ మనిషీ కోర్టుకెళ్ళకూడదు. వెళితే లాభంకోసమే వెళ్ళాలి."

"మరి - విక్రమ్‌ని పిలిపించలేదా నువ్వు?"

"నేను వదుల్తానా? అదీ అయింది. హత్య జరిగిననాటికి ఇరవై రోజుల ముందే విక్రమ్ వైజాగ్‌లో వున్నట్టు - హోటల్‌వాడి రిజిష్టర్ సాక్ష్యముంది."

"అయితే-"

"నువ్వేమీ చేయలేవా అంటావ్! వెంకట్రావుని పొడిచిన కత్తి ఎక్కడుందో పోలీసు కుక్కలకూడా దొరకలేదంటారు పోలీసులు."

ఇదిలా వుండగా ఢిల్లీనుంచి రంగధామరావుగారొచ్చారు విక్రమ్ నిరపరాధి అంటూ. అంటే - ఆయనను కూడా రప్పించి నాకు చెప్పించేటంత పలుకుబడి వుందన్నమాట చైర్మనుకు."

"ఒక్క ప్రశ్న అడుగుతాను, సమాధానం చెప్తావా?" అడిగాడు మూర్తి.

"నువ్వడిగే ప్రశ్న ఏమిటో నాకు తెల్సు. నువ్వు రిజైన్ చేసి నంత మాత్రాన రాఘవరావుకి న్యాయం జరుగుతుందా - అని. అవునా!"

అవునన్నట్టుగా తల ఆడించాడు మూర్తి. మరొక సిగరెట్టు వెలిగించుకొని అన్నాడు వేదాంతరావు-

"నా కళ్ళతో నేను చూశాను కాబట్టి ఇప్పుడు నిజమేమిటో నాకు తెల్సు. కాని ఏంచేయగలిగాను నేను! ప్రసిడెంట్సూ, రికమెండేషన్సూ - వీటితో సంబంధంలేకుండా రాజకీయాలు, అధికార దుర్వినియోగంలాంటి అంటురోగాలకు దూరంగా, కేవలం పుస్తకాల్లోని వెర్రిమొర్రి న్యాయం కాక - మంచులా స్వచ్ఛమైన న్యాయం జరగాలి ప్రతి మనిషికీ - అలాటి న్యాయాన్ని మాత్రమే ఇచ్చే న్యాయస్థానాలు కావాలి సమాజానికి."

రాధాకృష్ణమూర్తికి తెలుసు. వేదాంతరావు మాటలు ఆవేశంలో అన్నవి అయితే కావచ్చును కానీ ఆలోచన లేకుండా మాత్రం అన్నవి కావని. అతను తప్పకుండా ఆచరణలో పెడ్తాడని. అందుకే ఏమీ మాట్లాడ లేదు.